క్లుప్తంగా

మంచి నాయకుడిని కోల్పోయాం

ఎమ్మెల్యే సునీతారెడ్డి



దామోదర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధి పిల్లుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ దామోదర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం మృతదేహం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త



రైతులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణ

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ ఇన్‌చార్జి అధికారి కృష్ణ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలో ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై వివరాలు, తయారు తేదీ, లాట్‌నంబర్ వివరాలు తీసుకోవడంతో పాటు రశీదులు జాగ్రత్త పర్చుకోవాలన్నారు. డీలర్లు తమ ఎరువులు, విత్తనాల వివరాలను స్టాక్‌బోర్డులో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్ హరికిషన్, వంశీ, రైతులు శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సస్యరక్షణపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లి, మంతూర్ గ్రామాలలో గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా రైతులకు పంటల సాగు, సస్యరక్షణపై ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్రాల రసాయ పథకాలను వివరించారు. భూసార పరీక్షలు, విత్తన నాణ్యత ప్రమాణాలు, సబ్సిడీపై ఇచ్చే యంత్రాలు, డ్రోన్ల ఉపయోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ కుమార్, ఎన్ బిపిజిఆర్ శాస్త్రవేత్త డాక్టర్ అనిత, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్త డాక్టర్ బసవరాజ్, మండల వ్యవసాయ అధికారులు దీపిక, ఏఈఓలు లక్ష్మి దుర్గా ప్రసాద్, ఆత్మ బీటీఎం హరిత, హరీష్, సింధు రైతులు పాల్గొన్నారు.

మండల బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

మనోహరాబాద్(తూప్రాన్): మండల బీజేపీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఉపాధ్యక్షులుగా సాదు సత్యనారాయణ, కిరణ్‌కుమార్, రాజేష్‌గౌడ్, చాకలి మల్లేష్, ప్రధాన కార్యదర్శులుగా మల్లేష్ , సాయికిరణ్‌గౌడ్,, కార్యదర్శులుగా కృష్ణ , నరేందర్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, పాండుగౌడ్, కోశాధికారిగా భూపాల్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

రెండో విడత జాబితా విడుదల

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు సంబంధించి రెండో విడత ఎంపిక జాబిత విడుదల చేసినట్లు తునికి ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ హరిబాబు గురువారం తెలిపారు. ఎంపిక అయిన విద్యార్థులకు జిల్లాలోని వివిధ ఎంజేపీ బీసీ గురుకులాల్లో సీట్లు కేటాయించామని చెప్పారు.

మట్టి అక్రమ రవాణ

నర్సాపూర్ రూరల్: తుజాల్ పూర్ చెరువు నుంచి రాత్రి వేళలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని రోజులుగా కొత్తపేట వద్ద ఇటుక బట్టీల వ్యాపారం చేస్తున్న కొంత మంది గుట్టు చప్పుడు కాకుండా రాత్రివేళలో ఇష్టారాజ్యంగా జేసీబీలతో గోతులు చేసి మట్టిని సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయాల నిర్మాణాలకు విరాళాలు ఇస్తున్నందున తుజాల్ పూర్ గ్రామస్తులే మట్టి తీసుకెళ్లాలని చెప్పడంతోని తాము తీసుకెళ్తున్నామని ఇటుక వ్యాపారులు చెబుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈ మణిభూషన్‌ను వివరణ కోరగా.. రాత్రి వేళలో కావడంతో మట్టి తరలించే వారిని పట్టుకోవడంలో ఇబ్బందిగా మారిందన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

అదనపు కలెక్టర్ నగేష్

అల్లాదుర్గం(మెదక్): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ నగేశ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సీతానగర్ గ్రామంలో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని రక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ సుధాకర్, కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

నర్సాపూర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గురువారం బీజేపీ నాయకులు పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు రాజేందర్, సురేష్, రమణారావు, యాదగిరి, ఆంజనేయులుగౌడ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అటవీశాఖ అధికారులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం అర్బన్ పార్కులో అటవీశాఖ అధికారులు గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పార్కు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ఒకచోటికి చేర్చారు. అనంతరం మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడటం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అటవీ రేంజ్ అధికారులు కిరణ్‌కుమార్, ఓం ప్రకాష్, కలీం, భూపతి పాల్గొన్నారు.



అల్లాదుర్గం(మెదక్): అర్బన్ పార్కులో మొక్కలు నాటుతున్న అటవీశాఖ అధికారులు

ప్లాస్టిక్‌ను దూరం చేయాలి

మెదక్ కలెక్టరేట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం హాజరయ్యారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ హుస్సెన్ మాట్లాడుతూ స్వదేశీ జాగరణ మంచ్, కళాశాలలోని జాతీయ సేవా పథకం క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటినట్లు తెలిపారు.



డిగ్రీ కళాశాలలో పర్యావరణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రామాయంపేట అటవీప్రాంతంలో మొక్కలు నాటిన అటవీ రేంజీ అధికారి, తదితరులు



ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ వద్ద మొక్కలు నాటుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

అటవీ రేంజ్ అధికారి విద్యాసాగర్

రామాయంపేట(మెదక్): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామాయంపేట అటవీశాఖ రేంజీ అధికారి విద్యాసాగర్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని అక్కన్నపేట అటవీప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న పర్యాటక ఉద్యానవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఆయన సూచించారు. పర్యావరణం విషయమై ప్రజల్లో అవగాహన కలిప్ించడానికిగాను స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివేకాంద విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్రబోస్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, జిల్లా కోశాధికారి శ్రీనివాసశర్మ, కామారెడ్డి రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జైపాల్‌రెడ్డి, వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ రాంకుమార్ పాల్గొన్నారు.

చెట్లతోనే జీవులకు మనుగడ

మనోహరాబాద్(తూప్రాన్): పర్యావరణ సమతుల్యత, జీవుల మనుగడ కొనసాగాలంటే చెట్లే మేలని మనోహరాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని రంగాయపల్లిలో గల ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. మండల పీహెచ్‌సీ వద్ద ఐటీసీ పరిశ్రమ ఆధ్వర్యంలో ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యుల ఆధ్వర్యంలో కూడా మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ అగర్వాల్ ప్రతినిధులు వసంత్‌కుమార్, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా నుంచి కరీంకుంటను కాపాడాలి



కరీం కుంటకు ఆనుకుని పాతిన రాతి కడీలు

శివ్వంపేట(నర్సాపూర్): ఆక్రమణకు గురైన కుంటను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మండల పరిధి కొంతన్‌పల్లి గ్రామ పరిధిలో ఉన్న కరీంకుంట శిఖం భూమిని ఓ వెంచర్ నిర్వాహకులు కబ్జా చేసి పలు కట్టడాలు కట్టారు. ఇదే గ్రామంలో నక్షబాట ఆక్రమణకు గురవడంతో నాల్గు రోజుల క్రితం రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. గుర్తించిన బాటను మట్టి పోసి పునరుద్ధరించారు. ఇదే వెంచర్ నిర్వాహకులు శిఖం భూమిని సైతం ఆక్రమించారని రైతులు వాపోయారు. సర్వే నంబరు 341లో కరీంకుంటకు సంబంధించి మూడు ఎకరాలు 27 గుంటల భూమి రికార్డు పరంగా ఉంది. సంబంధిత అధికారులు కుంటను సర్వే చేసి కబ్జాకు గురైన శిఖం భూమిని స్వాధీనం చేసుకోవాల్సిన స్థానికులు కోరుతున్నారు.

సర్వే చేస్తాం: సునీత, ఇరిగేషన్ ఏఈ

కొంతన్‌పల్లిలోని కరీంకుంట శిఖం భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించి శిఖం భూమిని పూర్తిస్థాయిలో గుర్తించి ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల్లో సర్వే చేసి సమస్య పరిష్కరిస్తాం.

పురుడు పోసిన 108 సిబ్బంది



పాపను కుటుంబ సభ్యులకు ఇస్తున్న 108 సిబ్బంది

పాపన్నపేట(మెదక్): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలోనే 108 సిబ్బంది పురుడు పోశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కొడుపాక శివారులో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దీపికకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో 108 సిబ్బంది గ్రామానికి వెళ్లి మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో నాగ్సాన్‌పల్లి శివారులో 108 ఈఎంటీ సతీష్, పైలట్ దుర్గాప్రసాద్ గర్భిణికి పురుడు పోయగా.. పండంటి ఆడకూతురు జన్మించింది. పాప, తల్లి క్షేమంగా ఉండటంతో వెంటనే వారిని మెదక్ మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్: పట్టణంలో శ్రీరామసేన ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు సతీష్, విఠల్, దశరత్, దత్తు, మోహన్, అక్షయ పాటిల్, మధుసూదన్, మయాంక్‌రాజ్‌పుత్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ప్రధాని మోడీకి మద్దతుగా భరతమాత సేవలో యుద్ధభూమిలో మరణించిన భారత జవాన్ల స్మారకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఖేడ్ ప్రభుత్వాస్పత్రిలో ఉదయం శిబిరం ప్రారంభం అవుతుందని, యువకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

ఒక్క ఓటుతో సీఐటీయూ గెలుపు

మహీంద్రా కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం

జహీరాబాద్: జహీరాబాద్‌లోని మహీంద్ర అండ్ మహీంద్రా కర్మాగారంలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ ఒక్క ఓటుతో గట్టెక్కింది. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షపదవి కోసం అధికార సీఐటీయూ, ఐఎన్‌టీయూసీలు పోటీ పడ్డాయి. కర్మాగారంలో 543 మంది కార్మికులు ఉండగా 439 ఓట్లు పోలయ్యాయి. సీఐటీయూ యూనియన్‌కు 270 ఓట్లు రాగా, ఐఎన్‌టీయూసీకి 269 ఓట్లు పోలయ్యాయి. ఉత్కంఠ పోరులో సీఐటీయూ ఒక్క ఓటు తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో సీఐటీయూ కర్మాగారంలో వరుసగా నాలుగవ విజయాన్ని నమోదు చేసింది. ఐఎన్‌టీయూసీ తరఫున యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జనక్‌ప్రసాద్ పోటీచేశారు. కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికై న చుక్కా రాములు మాట్లాడుతూ కార్మికులకు నిజాయితీగా తమ సేవలను అందించడంతోనే తనను గెలిపించారన్నారు. ఈ గెలుపు మరింత బాధ్యత పెంచిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేష్, మహిపాల్, సాయిలు, రాజిరెడ్డి, మాణిక్, నరేష్ పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకుంటున్న చుక్కా రాములు

చుక్కా రాములు సంబరాలు

కార్మిక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన చుక్కా రాములు కర్మాగారం ఆవరణలో కార్మికులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు.

ఖాజిపల్లి సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఖాజిపల్లి గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): ఖాజిపల్లి సమస్యలుపరిష్కరించాలని కోరుతూ ఆర్‌కే ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ దండే రమాకాంత్ ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ..పారిశ్రామిక ప్రాంతమైన ఖాజిపల్లి గ్రామంలో రోడ్లు అధ్వానంగా మారాయని, పురాతన ఆలయం, తాగునీరు, గండిచెరువు ఎఫ్‌టీఎల్ తగ్గింపు వంటి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామంలోని పెద్దమ్మ ఆలయం నుంచి శివాలయం, నరసింహాస్వామి ఆలయం వరకు రోడ్డును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సత్యనారాయణ, నవీన్, మాజీ ఎంపీటీసీ భార్గవ్, నాయకులు వీణాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వార్డుల కేటాయింపుపై అభ్యంతరం

జిన్నారం (పటాన్‌చెరు): వార్డుల విభజన సక్రమంగా జరగలేదంటూ గుమ్మడిదల మున్సిపాలిటీ అఖిలపక్ష నాయకులు అధికారులను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నగర విస్తరణలో భాగంగా ప్రభుత్వం నూతన మున్సిపాలిటీలు ఏర్పాటు చేసింది. గుమ్మడిదల మున్సిపాలిటీకి సంబంధించి వార్డుల కేటాయింపులు సరైన క్రమంలో చేయలేదని స్థానిక నాయకులు అసహనం వ్యక్తం చేశారు. మరోసారి అధికార యంత్రాంగం వార్డుల విభజన ప్రక్రియను వరుస క్రమంలో చేపట్టాలని కమిషనర్ రఘుకు అఖిలపక్ష నాయకులు వినతి పత్రం అందజేశారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

సీడీసీ చైర్మన్ రాంరెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని సీడీసీ చైర్మన్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాచిరెడ్డిపల్లి,ముబారక్ పూర్,గొల్లగూడెం, ఆరూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను గురువారం ముగ్గుపోసి ప్రారంభించారు. అదేవిధంగా ఆరూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సరస్వతితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఇళ్లు మంజూరు అయినవారు ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సూచించారు. దసరాలోపు నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి విడతల వారీగా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని,దళారులను ఆశ్రయించ వద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న రాంరెడ్డి, తదితరులు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి

నారాయణఖేడ్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టాలని నిజాంపేట్ ఎంపీడీఓ సంగ్రాం తెలిపారు. నిజాంపేట్ మండలం దామర్ చెరులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు పక్కా ఇంటి కల ఇందిరమ్మ పథకం ద్వారా తీరనుందన్నారు. అనంతరం నిజాంపేట్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ఆవరణలో పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని అధికారులతో కలిసి సామూహికంగా 50 మొక్కలను నాటారు.

ఉపాధి కూలీలకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ బృందం

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్‌లో 'షీటీమ్' ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఏఎస్ఐ కిషన్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, సెల్‌ఫోన్ వాడకం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. మహిళలకు ఏరకమైన హాని జరిగిన మౌనం వీడి పోలీస్‌లకు తెలియజేయాలన్నారు. పిల్లలను ఈతకు పంపొద్దన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మహిళలు వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో ఒంటిపై బంగారం వేసుకోద్దని సూచించారు. ఒంటిపై బంగారం ఉంటే దొంగతనం జరిగే అవకాశం ఉందన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100కు కాల్ చేయాలని లేదా షీటీమ్ నంబర్ 8712667434కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీమ్ బృందం మమత, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ గెలల కొనుగోలుతో లబ్ధి

మిరుదొడ్డి(దుబ్బాక): తాత్కాలికంగా ప్రారంభించిన ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ఆయిల్‌పామ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్లాంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాములు కోరారు. గురువారం మండల పరిధిలోని పెద్దచెప్యాలలో మాజీ ఎంపీపీ గజ్జెల సాయిలుతో కలిసి ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. చెప్యాలలో కొనుగోలు షెడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గెలల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టన్ను ఆయిల్‌పామ్ గెలలకు రూ.18,748లు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): భూ భారతి రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి ఆదేశించారు. మండలంలోని హస్తాల్‌పూర్, ఏదులపల్లి గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన భూభారతి సదస్సులను ఆయన సందర్శించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరీ, గిర్దావర్ నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి భూభారతి

పాపన్నపేట(మెదక్): భూసమస్యల పరిష్కారానికి భూభారతి అమల్లోకి వచ్చిందని తహశీల్దార్ సతీష్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రామతీర్థం, అబ్లాపూర్ గ్రామాల్లో భూభారతి కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తగిన ఆధారాలతో తమ సమస్యలు తెలియజేస్తే రికార్డులకు అనుగుణంగా, తమ పరిధిలో గల అధికారాల మేరకు పరిష్కారం చూపుతామన్నారు. రామతీర్థంలో 83, అబ్లాపూర్‌లో 81 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

పెద్దశంకరంపేట(మెదక్): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని అమలు చేస్తుందని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. గురువారం పెద్దశంకరంపేట మండలం కమలాపూర్‌లో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును ఆమె పరిశీలించారు. అనంతరం రైతులకు రెవెన్యూ సదస్సులపై అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను తెలుసుకున్నారు. అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుంట్ల రాములు, నాయకులు కుంట్ల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): హస్తాల్‌పూర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించాలి

శివ్వంపేట(నర్సాపూర్): భూ భారతితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నర్సాపూర్ ఆర్డీఓ మైపాల్ అన్నారు. గురువారం మండల పరిధి చెన్నాపూర్, లింగోజిగూడ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చెన్నాపూర్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వచ్చిన ప్రతి దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. చెన్నాపూర్‌లో 54, లింగోజిగూడలో 29 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ కమలాద్రి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిషన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పెద్దశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న మెదక్ ఆర్డీఓ రమాదేవి



రామతీర్థంలో ఫిర్యాదులు పరిశీలిస్తున్న తహశీల్దార్

భూభారతిలో 139 దరఖాస్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): భూభారతి సదస్సులో గురువారం 139 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తిమ్మాపూర్‌లో 82, నాగ్సాన్‌పల్లిలో 57 దరఖాస్తులు వచ్చాయి. ఆయా గ్రామాలలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్, ఆర్ఐ శ్రీహరి, లక్ష్మన్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.